30-07-2023 ప్రాత:మురళి ఓంశాంతి "అవ్యక్త బాప్ దాదా" రివైజ్ 25-03-95
మధువనం

"బ్రాహ్మణ జీవితము యొక్క అన్నింటికన్నా శ్రేష్ఠమైన ఖజానా - సంకల్పాల ఖజానా"

ఈరోజు బాప్ దాదా నలువైపులా ఉన్న పిల్లల ఖజానాల ఖాతాలను చూస్తున్నారు. పిల్లలు ప్రతి ఒక్కరికీ ఎన్నో ఖజానాలు లభించాయి మరియు అవినాశిగా లెక్కలేనన్ని ఖజానాలు లభించాయి. కేవలం ఈ జన్మ కోసం కాదు కానీ అనేక జన్మల గ్యారంటీ ఉంది. ఇప్పుడు కూడా తోడుగా ఉన్నాయి మరియు ఇక ముందు కూడా తోడుగా ఉంటాయి. మరి ఈరోజు విశేషంగా అన్నింటికన్నా శ్రేష్ఠ ఖజానా ఏదైతే ఉందో మరియు సర్వ ఖజానాలకు విశేషమైన ఆధారమేదైతే ఉందో, దానినే విశేషంగా చూస్తున్నారు - అందరి ఖాతాలలో ఎంతగా జమ అయింది? లభించడము లెక్కలేనంత లభించింది కానీ ఎంతగా జమ అయింది? అన్నింటికన్నా శ్రేష్ఠమైన ఖజానా సంకల్పాల ఖజానా మరియు మీ అందరి శ్రేష్ఠ సంకల్పాలే బ్రాహ్మణ జీవితానికి ఆధారము. సంకల్పాల ఖజానా చాలా శక్తిశాలిగా ఉంటుంది. సంకల్పాల ద్వారా సెకెండు కన్నా తక్కువ సమయంలో పరంధామం వరకు చేరుకోగలరు. సంకల్ప శక్తి ఒక ఆటోమేటిక్ రాకెట్ కన్నా కూడా తీవ్ర గతి కల రాకెట్. దాని ద్వారా ఎక్కడికి కావాలంటే అక్కడికి చేరుకోగలరు. మీరు కూర్చున్నా కానీ, ఏవైనా కర్మలు చేస్తున్నా కానీ సంకల్పాల ఖజానా ద్వారా లేక శక్తి ద్వారా ఏ ఆత్మ వద్దకు చేరుకోవాలనుకుంటే వారి సమీపంగా స్వయాన్ని అనుభవం చేసుకోగలరు. ఏ స్థానానికి చేరుకోవాలనుకుంటే అక్కడికి చేరుకోగలరు. ఏ స్థితిని పొందాలనుకుంటే, అది శ్రేష్ఠమైనదైనా, సంతోషానికి చెందినదైనా, వ్యర్థమైనా, బలహీనతదైనా, క్షణం యొక్క సంకల్పంతో తమదిగా చేసుకోగలరు. నేను శ్రేష్ఠ బ్రాహ్మణ ఆత్మను - అని సంకల్పం చేయగానే శ్రేష్ఠ స్థితి మరియు శ్రేష్ఠ అనుభూతి కలుగుతుంది, అలాగే నేను బలహీన ఆత్మను, నాలో ఎటువంటి శక్తి లేదు అని సంకల్పం చేస్తే, ఒక్క క్షణం యొక్క సంకల్పంతో సంతోషం మాయమైపోతుంది. వ్యాకులత యొక్క చిహ్నాలు స్థితిలో అనుభవమవుతాయి. కానీ రెండు స్థితులకూ ఆధారము - సంకల్పాలు. స్మృతిలో కూర్చున్నప్పుడు కూడా సంకల్పాల ఆధారంతోనే స్థితిని తయారుచేసుకుంటారు. నేను బిందువును, నేను ఫరిశ్తాను... ఈ స్థితి సంకల్పం ద్వారానే తయారైంది. కావున సంకల్పం ఎంత శక్తివంతమైనది.

జ్ఞానానికి ఆధారము కూడా సంకల్పాలే. నేను ఆత్మను, శరీరాన్ని కాదు - ఈ సంకల్పాలు చేస్తారు. రోజంతా మనసు-బుద్ధికి శుద్ధ సంకల్పాలను ఇస్తారు లేక మననంలో శుద్ధ సంకల్పాలు చేస్తారు, కావున మనన శక్తికి ఆధారము కూడా సంకల్ప శక్తి. ధారణ చేస్తారు, ఈ రోజు నేను సహన శక్తిని ధారణ చేయాలి అని మనసుకు-బుద్ధికి సంకల్పాన్ని ఇస్తారు, కావున ధారణకు ఆధారము కూడా సంకల్పాలే. సేవ చేస్తారు, ప్లాన్లు తయారుచేస్తారు అప్పుడు కూడా శుద్ధ సంకల్పాలే నడుస్తాయి కదా! శుద్ధ సంకల్పాల ద్వారానే ప్లాన్లు తయారవుతాయి. అనుభవముంది కదా! కావున బ్రాహ్మణ జీవితం యొక్క విశేషమైన శ్రేష్ఠ ఖజానా - సంకల్పాల ఖజానా. ఒకవేళ మీరు సంకల్పాల ఖజానాను సఫలం చేసుకున్నట్లయితే మీ స్థితి, కర్మ మొత్తం రోజంతా చాలా బాగుంటుంది మరియు సంకల్పాల ఖజానాను వ్యర్థంగా పోగొట్టుకున్నట్లయితే రిజల్టు ఏమవుతుంది? ఏ స్థితినైతే కోరుకుంటారో ఆ స్థితి ఉండదు. వ్యర్థ సంకల్పాలు బుద్ధిని కూడా బలహీనపరుస్తాయి మరియు స్థితిని కూడా బలహీనపరుస్తాయి అని మీ అందరికీ తెలుసు. ఎవరికైతే వ్యర్థం నడుస్తుందో, వారి బుద్ధి బలహీనంగా ఉంటుంది, కన్ ఫ్యూజ్డ్ (తికమక) గా ఉంటారు. నిర్ణయాలు సరిగ్గా ఉండవు. సదా తికమకపడుతూ ఉంటారు. ఏం చేయాలి, ఏం చేయకూడదు, స్పష్టమైన నిర్ణయము ఉండదు. మరియు వ్యర్థ సంకల్పాల గతి చాలా వేగంగా ఉంటుంది. వ్యర్థ సంకల్పాల గురించైతే అందరికీ అనుభవము ఉంటుంది. వికల్పాలు కాదు, వ్యర్థం యొక్క అనుభవము అందరికీ ఉంది. గతి వేగంగా ఉన్న కారణంగా దానిని కంట్రోల్ చేయలేకపోతారు. కంట్రోల్ సమాప్తమైపోతుంది. వ్యాకులత చెందడము లేక సంతోషం మాయమవ్వడము లేక మనసు ఉదాసీనంగా ఉండడము, తమ జీవితంతో ఆనందం కలగకపోవడము - ఇవి వ్యర్థ సంకల్పాల గుర్తులు. నా స్థితి అసలు ఇలా ఎందుకు అయింది? అని చాలా మందికి తెలియనే తెలియదు. వారు పెద్ద-పెద్ద విషయాలను చూస్తారు - ఎటువంటి వికర్మలైతే చేయలేదు కదా, ఎటువంటి పొరపాటు చేయలేదు కదా అయినా సంతోషం ఎందుకు తక్కువగా ఉంది, ఉదాసీనత ఎందుకు, నేడు జీవితంలో ఆనందం ఎందుకు కలగడం లేదు! మనసు ఎందుకు నిమగ్నమవ్వడం లేదు. దానికి కారణం ఏమిటి? వికర్మలను చూస్తారు, వికల్పాలను చూస్తారు, పెద్ద పొరపాట్లను చెక్ చేసుకుంటారు కానీ సూక్ష్మ పొరపాటు ఏమిటంటే - వ్యర్థంగా ఖజానాలను పోగొట్టుకోవడము. తప్పకుండా వేస్ట్ గా, వ్యర్థంగా పోగొట్టుకునే

ఖాతా పెరిగి ఉంది. ఏ విధంగానైతే శారీరక రోగము పెద్ద రూపంలో ఉండదు, చిన్న రూపంలో ఉంటుంది కానీ చిన్నదాని నుండి పెరుగుతూ-పెరుగుతూ పెద్ద రూపము అయిపోతుంది మరియు పెద్ద రూపము కనిపిస్తుంది, చిన్న రూపము కనిపించదు, అలాగే ఈ వ్యర్థ ఖాతా, పోగొట్టుకునే ఖాతా పెరుగుతూ ఉంటుంది, పెరుగుతూ ఉంటుంది. పాపం యొక్క ఖాతా వేరు, ఇది ఖజానాలను పోగొట్టుకునే ఖాతా. పాపమైతే స్పష్టంగా కనిపిస్తుంది, ఈరోజు ఇది చేసాము కావున సంతోషం మాయమైపోయింది అని అనుభవం చేసుకుంటారు. కానీ వ్యర్థంగా పోగొట్టుకునే ఖాతా, దాని చెకింగ్ తక్కువగా జరుగుతుంది. మరియు మీరేమో - సరే, ఈరోజు కూడా గడిచిపోయింది, మంచిగా జరిగింది, ఏ విధమైన పొరపాటు చేయలేదు అని అనుకుంటారు, కానీ - తమ సంకల్పాల శ్రేష్ఠ ఖజానాను జమ చేసుకున్నామా లేక వ్యర్థంగా పోగొట్టుకున్నామా? అని చెక్ చేసుకున్నారా. ఒకవేళ జమ అవ్వకపోతే అది పోగొట్టుకునే ఖాతా అవుతుంది కదా! లోలోపల ఎంతో చేస్తున్నాము అని అనిపిస్తుంది, కానీ ఈరోజు ఏ-ఏ ఖజానాలను జమ చేసుకున్నాము? అన్న ఖాతాను చెక్ చేసుకోండి. చెక్ చేసుకోవడం వస్తుందా? స్వయం యొక్క చెకర్ గా అయ్యారా లేక ఇతరుల చెకర్ గా అయ్యారా? ఎందుకంటే స్వయాన్ని లోపలి నుండి చూసుకోవాల్సి ఉంటుంది, ఇతరులను బయటి నుండి చూడడము జరుగుతుంది, అది సహజమవుతుంది. మరి విశేషంగా శ్రేష్ఠ సంకల్పాల ఖజానా ఏదైతే ఉందో, అది ఎక్కువగా వ్యర్థంగా పోతుంది అని బాప్ దాదా చూస్తున్నారు. అది వ్యర్థంగా పోయిందా లేక సమర్థంగా ఉందా? అన్నది తెలియనే తెలియదు.

బ్రహ్మాబాబాను ఎకానమీ అవతారము అని అంటారు. మీరందరూ ఎవరు? మీరందరూ కూడా మాస్టర్లే కాదా? ఎకానమీ రాదా? ఖర్చు చేయడం వస్తుంది! ఆ మాటకొస్తే డబుల్ విదేశీయులకు లౌకిక జీవిత పరంగా జమా ఖాతాను చేసుకోవడం తక్కువగా వస్తుంది. తింటారు మరియు ఖర్చు చేస్తారు, ఇక సమాప్తమైపోతుంది. బ్యాంక్ బ్యాలెన్స్ తక్కువగా పెట్టుకుంటారు. కానీ ఇందులో ఎకానమీ అవతారంగా అవ్వాల్సి ఉంటుంది. బాప్ దాదా చూస్తున్నారు - ఎంతైతే లభించిందో, ఎంతైతే సంకల్పాల శ్రేష్ఠ ఖజానా జమ అవ్వాలో అంతగా అవ్వలేదు, వ్యర్థం యొక్క లెక్క ఎక్కువగా చూసారు. ఒకవేళ సంకల్పాలు వ్యర్థమైనట్లయితే ఇతర ఖజానాలూ స్వతహాగానే వ్యర్థమైపోతాయి. సంకల్పాలు వ్యర్థమైతే, కర్మలు మరియు మాటలు ఏమవుతాయి? వ్యర్థమే అవుతాయి కదా! అందుకు పునాది సంకల్పాలు. కావున సంకల్పాలను చెక్ చేసుకోండి. తేలికగా వదలకండి. ఫరవాలేదు, కేవలం రెండు నిమిషాలే కదా అయ్యింది, ఎక్కువగా అవ్వలేదు... కానీ రెండు నిమిషాలలో - ఎన్ని సంకల్పాలు నడుస్తాయి? అన్నది మీరు చెక్ చేసుకోండి. వ్యర్థ సంకల్పాలు వేగంగా ఉంటాయి కదా! ఒక్క క్షణంలో ఆబూ నుండి అమెరికా వరకు చేరుకుంటారు. మామూలుగా అయితే చేరుకోవడానికి ఎన్ని గంటలు పడతాయి! కావున అంత తీవ్ర వేగం ఉంటుంది, ఆ గతి అనుసారంగా చెక్ చేసుకోండి, మీ సంకల్ప శక్తిని పొదుపు చేయండి మరియు రాత్రికి చెక్ చేసుకోండి. ఒకవేళ అటెన్షన్ పెట్టి ఏదైనా వస్తువును పొదుపు చేసినట్లయితే, ఆ పొదుపు తక్కువగా ఉన్నా కానీ ఆ పొదుపు యొక్క ఎక్స్ ట్రా సంతోషం ఉంటుంది. ఒకవేళ 10 పౌండ్లు లేక డాలర్లు ఖర్చు అవ్వాలి కానీ మీరు ఒక పౌండు లేక డాలర్ ను పొదుపు చేసారు, అప్పుడు ఒక్క పౌండ్ ను పొదుపు చేసాము అని చాలా సంతోషం ఉంటుంది. కావున మీ సంకల్పాల పైన కంట్రోలింగ్ పవర్ పెట్టుకోండి. మేము అలా జరగాలనైతే అనుకోలేదు, అర్థం చేసుకుంటున్నాము కానీ ఏం చేయాలి, అలా జరిగిపోతుంది... అని అనకండి. అలా జరిగిపోతుంది అని ఎవరంటారు? యజమానులా లేక దాసులా? యజమాని కంట్రోల్ లోనైతే ఉంటాయి కదా. ఒకవేళ యజమానికి కూడా ఎవరైనా మోసం చేసినట్లయితే వారు యజమానులా? కావున చెక్ చేసుకోండి - కంట్రోలింగ్ పవర్ ఉందా? ఒకటేమో - పొదుపు చేయండి, వేస్ట్ కి బదులుగా బెస్ట్ ఖాతాలో జమ చేయండి మరియు రెండవది - ఒకవేళ పొదుపు చేయలేకపోతే వ్యర్థాన్ని సమర్థ సంకల్పాలలోకి పరివర్తన చేయండి. ఒకవేళ కంట్రోల్ అవ్వలేకపోతే పరివర్తన అయితే చేయగలరు కదా? దాని వేగాన్ని త్వరగా పరివర్తన చేయండి. లేకపోతే అలవాటైపోతుంది. ఒక గంట సమయాన్ని చెక్ చేసుకున్నా, ఒక గంటలో కూడా 5-10 నిమిషాలు కూడా ఏవైతే వ్యర్థ సంకల్పాలు నడుస్తున్నాయో, ఆ 5 నిమిషాలు కూడా వేస్ట్ నుండి బెస్ట్ లో జమ అయినట్లయితే, 12 గంటలలో 5-5 నిమిషాలు కూడా ఎంతవుతాయి? మరియు సంతోషం ఎంతగా ఉంటుంది? ఎంతైతే శ్రేష్ఠ సంకల్పాల ఖాతా జమా అవుతుందో, అంతగా సమయానికి జమా ఖాతా ఉపయోగపడుతుంది. లేకపోతే స్థూల ధనము ఒకవేళ జమ అవ్వకపోతే సమయానికి ఎలాగైతే మోసపోతారో, అలాగే ఇక్కడ కూడా ఎప్పుడైనా, ఏదైనా పెద్ద పరీక్ష వచ్చినప్పుడు మనస్సు మరియు బుద్ధి ఖాళీ-ఖాళీగా అనిపిస్తుంది, శక్తిశాలిగా అనిపించదు. మరి ఏం చేయాలి? జమ చేయడం నేర్చుకోండి. వచ్చే సంవత్సరం చూసినప్పుడు అందరి శ్రేష్ఠ సంకల్పాల ఖాతా నిండుగా ఉండాలి. ఖాళీ-ఖాళీగా ఉండకూడదు. ఈ శ్రేష్ఠ సంకల్పాల ఖజానాయే శ్రేష్ఠ ప్రారబ్ధానికి ఆధారమవుతుంది. మరి జమ చేయడం వస్తుందా? రాజయోగి అనగా చెక్ చేయడం కూడా వస్తుంది మరియు జమ చేయడం కూడా వస్తుంది. ఎవరి ఖాతా అయితే జమ

అయి ఉంటుందో వారి నడవడిక మరియు ముఖము సదా నిండుగా కనిపిస్తుంది. అంతేకానీ, ఈరోజు చూస్తే ముఖము బాగా మెరుస్తూ, మళ్ళీ రేపు చూస్తే ఉదాసీనత యొక్క అల - ఇలా ఉండదు. మొత్తం రోజంతటిలో మీ ఫోజులు ఎంతగా మారుతాయి? అన్నది చెక్ చేసుకోండి. ఎప్పుడైనా చెక్ చేసుకున్నారా? చాలా ఫోజులు మారుతాయి. బాప్ దాదా అయితే అందరి ఫోజ్లను చూస్తారు కదా! అప్పుడప్పుడు ఏమి చూస్తారంటే - చాలా మంది పిల్లలు కర్మ చేయడంలో అంత సమయం తీసుకోరు కానీ చేసిన కర్మల యొక్క పశ్చాత్తాపంలో సమయాన్ని చాలా పోగొట్టుకుంటారు. మళ్ళీ - 3 రోజులు గడిచిపోయింది, సంతోషం మాయమైపోయింది అని అంటారు. సంతోషం ఎందుకు మాయమైంది, ఎక్కడికి వెళ్ళింది, ఎవరు తీసుకువెళ్ళారు? ఖజానా అయితే మీది, కానీ ఎవరు తీసుకువెళ్ళారు? పశ్చాత్తాపపడడం మంచిదే, ఎందుకంటే పశ్చాత్తాపము పరివర్తన చేయిస్తుంది కానీ అందుకు ఎక్కువ సమయం తీసుకోకండి. పశ్చాత్తాపంతో ఏడ్చినప్పుడు మొత్తం వారమంతా ఏడుస్తూ ఉంటారు. పశ్చాత్తాపపడ్డారు, చాలా మంచిది కానీ పశ్చాత్తాపపడండి మరియు ప్రాప్తి యొక్క సంతోషాన్ని తీసుకురండి. ఇక తర్వాత కోసం క్షణంలో నిర్ణయం తీసుకోండి - ఇది చేయాలా లేక చేయకూడదా. ఇంతకుముందు వినిపించాము కదా - నాట్ మరియు డాట్, ఈ రెండు పదాలను గుర్తుంచుకోండి. నాట్ (ఆలోచించకండి) మరియు డాట్ (బిందువు పెట్టండి). నాలుగు గంటలు ఏడుస్తూ ఉన్నారు, అయితే కన్నీరు రాలేదు, కానీ లోలోపల ఏడుస్తూ ఉన్నారు. అర గంట కన్నీరు కార్చారు మరియు నాలుగు గంటలు మనస్సుతో ఏడ్చారు, ఇంతగా పశ్చాత్తాపపడకండి. ఇది చాలా ఎక్కువ. పశ్చాత్తాపానికి కూడా ఒక హద్దు పెట్టుకోండి.

బాప్ దాదాకు డబుల్ విదేశీయుల ఒక విశేషత చాలా బాగా అనిపిస్తుంది, ఏడ్వడం బాగా అనిపించదు కానీ ఒక విశేషత బాగా అనిపిస్తుంది. అదేమిటి? సత్యమైన హృదయాన్ని చూసి స్వామి సంతోషపడతారు. సత్యం చెప్పడంలో భయపడరు, దాచి పెట్టరు. కావున సత్యమైన హృదయము ఉంది, దీని కారణంగా తండ్రి యొక్క డబల్ ప్రేమకు కూడా పాత్రులుగా ఉన్నారు. మరి సత్యమైన హృదయాన్ని ఉంచారు, స్వామిని సంతుష్టపర్చారు, అలాగే పరివర్తనను కూడా అంతే త్వరగా చేయాలి. ఇది జరిగిపోయింది, ఇది జరిగిపోయింది... అని పదే-పదే దానిని మీ లోపల వర్ణన చేయకండి. జరిగిపోయింది, ఇక ఫినిష్. ఇక ముందు కోసం అటెన్షన్ పెట్టండి. కానీ అప్పుడప్పుడు అటెన్షన్ కు బదులుగా టెన్షన్ తీసుకుంటారు, అది చేయకూడదు. అతి పెద్ద జస్టిస్ గా అవ్వండి. ఇక్కడ కూడా చీఫ్ జస్టిస్ అంటారు కదా, మీరైతే చీఫ్ జస్టిస్ కి కూడా చీఫ్ వంటివారు. మీ కొరకు మీరు త్వరత్వరగా - ఇది రాంగ్, ఇది రైట్ అని నిర్ణయం తీసుకోండి. రాంగ్ అయితే నాట్ మరియు డాట్. అలా జరిగి ఉండకపోతే ఇలా ఉండి ఉండేది, అలా చేసి ఉండకపోతే ఇలా ఉండి ఉండేది... ఇలా పోగొట్టుకునే ఖాతాను జమ చేసుకుంటారు. సంపాదన సమాప్తమైపోతుంది, జమ ఖాతా సమాప్తమవుతుంది. ఆలోచించండి కానీ వ్యర్థంగా కాదు. మరియు ఒక గంటలో ఇంత పొదుపు చేసాము... అని పొదుపు చేసి చూపించండి. వ్యర్థం మొదలైంది కానీ మేము ఛేంజ్ చేసుకున్నాము మరియు జమ చేసుకున్నాము అన్న రిజల్టును చూపించండి. వేస్ట్ ను పొదుపు చేయండి. ఈ పొదుపు యొక్క ఖాతా చాలా సంతోషాన్ని కలిగిస్తుంది.

ఈ సంవత్సరం బాప్ దాదా అందరి పొదుపు ఖాతాను నిండుగా చూడాలనుకుంటున్నారు. మీరు చేయగలరు కదా? కావున ఇప్పుడు తీవ్ర వేగంతో చేయండి ఎందుకంటే సమయం కూడా వేగంగా వెళ్తుంది కదా! ఇందులో నంబరువన్ లోకి ఎవరు వెళ్తారు? పొదుపు ఖాతా ఎవరిది అందరికన్నా ఎక్కువగా ఉంటుంది? అనేది చూస్తారు. పొదుపు ఖాతాలో నంబరువారుగా ఎవరెవరు ఉంటారు అన్న లిస్ట్ ను తయారుచేస్తారు. ఒకవేళ మీరు సంకల్పాలను కంట్రోల్ చేసినట్లయితే ఇతరులను కంట్రోల్ చేసే శ్రమ చేయాల్సిన అవసరం ఉండదు. చెప్పాలని అనుకోలేదు కానీ నోటి నుండి ఎలా వచ్చేసిందో తెలియదు అని చాలామంది అంటారు. కానీ ఎప్పుడైతే మాటలు వెలువడతాయో లేక కర్మలు కూడా జరుగుతాయో, వాటి కన్నా ముందైతే సంకల్పం వస్తుంది. ఒకవేళ ఎవరిపైనైనా క్రోధం చేయాల్సి వచ్చినా మొదట సంకల్పంలో ప్లాన్ తయారవుతుంది - ఇలా చేస్తాను, ఇలా మాట్లాడతాను, వాళ్ళు ఏమనుకుంటున్నారు... అని. ఇలా ప్లాన్ నడుస్తుంది. అప్పుడు సమయాన్ని కూడా అందులో ఉపయోగిస్తారు. అది ఎప్పుడొస్తుంది, ఎవరొస్తారు... అంటూ సమయాన్ని చూస్తూ ఉంటారు. కావున సంకల్పాల ఖజానా వెనుక సమయం యొక్క ఖజానా కూడా వ్యర్థమవుతుంది. రెండింటికీ సంబంధం ఉంది. సంకల్పాలను పొదుపు చేయడం ద్వారా సమయాన్ని, మాటలను పొదుపు చేయడము స్వతహాగానే జరుగుతుంది.

మరి సంవత్సరం గడిచిపోతూ ఉంది. ఇప్పుడు సంకల్పాలలో సాధారణ సంకల్పాలు చేయకండి, ప్రతిజ్ఞ చేయండి. శరీరం పోయినా కానీ ప్రతిజ్ఞ పోకూడదు. ఎంత సహనం చేయాల్సి వచ్చినా, పరివర్తన చేయాల్సి వచ్చినా ప్రతిజ్ఞను వదలకండి. దీనిని దృఢ సంకల్పము అని అంటారు. ఆలోచించడమైతే చాలా బాగా ఆలోచిస్తారు, బాప్ దాదా కూడా సంతోషిస్తారు.

ఇది చేస్తాము, ఇది చేస్తాము, ఇది చేయము - అని సంతోషపెడతారు కానీ ఇందులో దృఢత్వం ద్వారా సదా అన్న పదాన్ని యాడ్ చేయండి. కొంత సమయమైతే ప్రభావాన్ని చూపిస్తారు. దాని గురించి ఇంతకుముందు వినిపించాము కదా - స్వయాన్ని సదా ఎకానమీ అవతారంగా భావించండి. ఎకానమీ, ఏకనామీ మరియు ఏకాంతవాసీ అన్నది కలిసి-కలిసి జరగాలి. ఎక్కువగా మాటలలోకి రాకండి. ఏకాంతవాసులుగా అవ్వండి. ఎవరైతే రోజంతటిలో మాటలలోకి వస్తారో వారి సంకల్పాలు, సమయము, అన్ని ఖజానాలు ఎక్కువగా వేస్ట్ అవుతాయి. ఏకాంతవాసి అన్న పదానికి రెండు అర్థాలు ఉన్నాయి. కేవలం బాహ్య పరంగా ఏకాంతం కాదు కానీ ఒక్కరి అంతంలో నిమగ్నమవ్వడము, ఏకాంతము. అలా కాకుండా కేవలం బాహ్య పరంగా ఏకాంతం ఉన్నట్లయితే బోర్ అయిపోతారు, రోజు ఎలా గడుస్తుందో తెలియదు! అని అంటారు. కానీ ఒక్క తండ్రి యొక్క అంతములో నిమగ్నమవ్వండి. ఏ విధంగానైతే సాగరం యొక్క లోతుల్లోకి వెళ్ళినప్పుడు ఎంతగా ఖజానా లభిస్తుంది! అలా అంతములోకి వెళ్ళిపోండి అనగా తండ్రి నుండి ఏ ప్రాప్తులైతే లభిస్తాయో, అందులో నిమగ్నమైపోండి. కేవలం పై-పైన అలలలో తేలి ఆడకండి, అంతములోకి వెళ్ళండి, నిమగ్నమైపోండి. అప్పుడు ఎంత ఆనందం కలుగుతుందో చూడండి. సర్వ ఖజానాలలో ఎకానమీ చేయండి, మరియు ఒక్క తండ్రి తప్ప ఇంకెవరూ లేరు, దీనిని ఏకనామీ అని అంటారు. ఇటువంటి స్థితిలో ఉండేవారు తమ సర్వ ఖజానాలను జమ చేసుకోగలరు, లేకపోతే జమ అవ్వదు. మరి ఎకానమీ చేయడం తెలుసు కదా? అచ్ఛా!

నలువైపులా కల ఆత్మిక సత్యమైన డైమండ్ ఆత్మలకు, సదా ఎకానమీ అవతారాలైన విశేష ఆత్మలకు, సదా ఏకనామీ, ఏకాంతప్రియ విశేష ఆత్మలకు, తమ వైబ్రేషన్, వృత్తి యొక్క మెరుపు ద్వారా విశ్వంలో ప్రకాశాన్ని వ్యాపింపజేసే మెరుస్తున్న ఆత్మలకు బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు నమస్తే.

దాదీలతో:- అన్ని కార్యాలు సఫలమయ్యే ఉన్నాయి. సఫలతా స్వరూప ఆత్మలైన మీరు నిమిత్తులు. నిమిత్త ఆత్మలైన మీరందరూ ఏ సితారలు? సఫలతా సితారలు కదా! ఈ సంగఠన అంతా సఫలతా సితారలే. ఈ పూర్తి సంగఠన బ్రాహ్మణ పరివారపు తారా మండలంలో సఫలతా సితారలుగా మెరుస్తున్నారు. అచ్ఛా.

వరదానము:- సంతోషపు ఖజానా ద్వారా అనేక ఆత్మలను సుసంపన్నులుగా చేసే సదా భాగ్యశాలి భవ

ఎవరైతే సదా సంతోషంగా ఉంటారో మరియు సంతోషపు ఖజానా ద్వారా అనేక ఆత్మలను సుసంపన్నులుగా తయారుచేస్తారో, వారినే భాగ్యశాలులు అని అంటారు. ఈరోజుల్లో ప్రతి ఒక్కరికీ విశేషంగా సంతోషపు ఖజానా యొక్క అవసరము ఉంది, మిగిలినవన్నీ ఉన్నాయి కానీ సంతోషం లేదు. మీ అందరికీ అయితే సంతోషాల గని లభించింది. సంతోషాల వెరైటీ ఖజానా మీ వద్ద ఉంది, కేవలము ఈ ఖజానాకు యజమానులుగా అయ్యి, ఏదైతే లభించిందో, దానిని స్వయం ప్రతి మరియు సర్వుల ప్రతి ఉపయోగించినట్లయితే సుసంపన్నులుగా అనుభవం చేసుకుంటారు.

స్లోగన్:- ఇతర ఆత్మల వ్యర్థ భావాన్ని శ్రేష్ఠ భావములోకి పరివర్తన చెయ్యడమే సత్యమైన సేవ.